క్లుప్తంగా

వైభవంగా ఆలయ ప్రతిష్ట



నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెంలో రూ.30 లక్షల వ్యయంతో తుర్లపాడు మేజర్ కాలువ పక్కనే నూతనంగా నిర్మించిన పోలేరమ్మ, గంగమ్మ, పోతురాజు ఆలయ ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వాతి నక్షత్రయుక్త శుభలగ్నాన ప్రతిష్ట మహోత్సవాన్ని నరసరావుపేటకు చెందిన అత్తలూరి బాలశంకరశాస్త్రి బృందం ఆధ్వర్యంలో జరిపారు. ప్రతిష్ట సందర్భంగా మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవాలు, శాంతి హోమాలు జరిగాయి. భారీ అన్నదానం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేడుకలకు పలు గ్రామాల నుంచి భక్తులు తరలి రావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమాల్ని కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

వైభవంగా రేణుకాంబదేవి ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు




నాదెండ్ల: మండలంలోని గణపవరంలో రేణుకాంబ, గంగాదేవి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యావచనం, పంచగవ్యప్రాసన, వాస్తు, అకల్పతా హోమాలు నిర్వహించారు. కెల్లంపల్లి కుటుంబాలకు చెందిన మహిళలు అమ్మవారి ఉత్సవ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు నిర్వహించారు. ప్రత్తిపాడుకు చెందిన బృందావనం ఆదిత్య నరసింహాచార్యుల బృందం ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. 17న ప్రధాన దేవతా హోమం, పంచగవ్య ఆదివాసాలు, ధాన్యాదివాసం, మూర్తి హోమం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 18న ఉదయం శాంతి కుంభాభిషేకం, గజారోహణ, గో దర్శనం, ధూళి దర్శనం అనంతరం ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నారు. భారీ అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల్ని కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బాల్య వివాహాలతో అనర్థాలే ఎక్కువ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామ సచివాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాల గురించి గ్రామస్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ వాటిని వ్యతిరేకించాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నివారణకు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి ఆర్. శ్రీనివాస్, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ పర్సన్ కంచర్ల సుబ్బరామయ్య, వీవోఏ ధనలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్‌లో..



మండలంలోని లింగంగుంట్ల ఎస్టీ కాలనీలో సోమవారం బాల్య వివాహ రహిత భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి యనాది కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి డాక్టర్ పుట్టా రమణయ్య, పంచాయతీ కార్యదర్శి కె.వి. ప్రసాద్, మహిళా పోలీస్ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు. బాల్య వివాహాల వల్ల దుష్ఫలితాల్ని వివరించారు. బాలురకు 21, బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు జరిపించాలని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



కొండాయపాలెంలో రక్తపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని కొండాయపాలెంలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు, మందుల పంపిణీ గురించి రోగుల్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్యపరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి ఉచితంగా వైద్యం, మందులు అందించడంతో పాటు సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. చిన్న కుటుంబాలు మెరుగైన వైద్యం చేయించుకోలేక పోతున్నాయని, అలాంటి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంచి కార్యక్రమమని తెలిపారు. ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ఎవరి వద్దకు వెళ్లాలో చాలా మందికి తెలియదని, వారికి ప్రభుత్వం నుంచి సహాయం అందేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలందరి ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష రక్షగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుర్లపాటి చౌడయ్య, సర్పంచ్ కేతినేని వెంకట్రావు, శాకమూరి బుచ్చయ్య, బోడెపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తలూరు శిబిరంలో 291 మందికి వైద్య పరీక్షలు

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 291 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యులు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దావులూరి సంపూర్ణ, తహసీల్దారు షేక్ జాన్ సైదులు, వైద్యాధికారి యం. రాధాకృష్ణన్, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, వీఆర్వో రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఎండుగుంపాలెంలో శిబిరం

నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో నాదెండ్ల, గణపవరం వైద్యాధికారులతో పాటు కాటూరి ఆసుపత్రి వైద్యుల బృందం పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యల్లమంద శిబిరంలో భారీగా వైద్య పరీక్షలు

నరసరావుపేట రూరల్: మండలంలోని యల్లమంద-1 గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 502మంది హాజరయ్యారు. ఇందులో మహిళలు 245మంది, పురుషులు 257మంది, విద్యార్థులు ఐదుగురు ఉన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 112మందికి పరీక్షలు నిర్వహించి, 68మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నందకుమార్, డాక్టర్ జోయల్ ప్రసాద్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, కరెంటు నాగేశ్వరరావు, రాయపూడి సుబ్బారావు పర్యవేక్షించారు.

గోగులపాడులో 563 మందికి వైద్య పరీక్షలు

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడులో సోమవారం రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో మొత్తం 563 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 296 మంది మహిళలు, 267 మంది పురుషులు, 31 మంది పిల్లలు ఉన్నారు. 328 మందికి రక్త, మూత్ర తదితర పరీక్షలు నిర్వహించారు. 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 15 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు రిఫర్ చేశారు. శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సాయిలక్ష్మి, జనరల్ సర్జన్ డాక్టర్ శివప్రదీప్, స్థానిక వైద్యులు రేవతీబాయి, నరసింహారెడ్డి సేవలందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంకారావుతో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



యల్లమందలో రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గోగులపాడులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

ప్రజల చెంతకే కార్పొరేట్ వైద్యం



చెంఘీజ్‌ఖాన్‌పేట క్యాంపునకు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు

యడ్లపాడు: దేశంలోనే తొలిసారిగా పేదల వద్దకే వైద్యులు వెళ్లి అన్ని రకాల సేవలు అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని ఎంపీపీ పి. ఝాన్సీ పేర్కొన్నారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ సచివాలయం ప్రాంగణంలో సోమవారం సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ మల్లవరపు పోలవతితో కలసి ప్రారంభించారు. శిబిరంలోని పీహెచ్‌సీ వైద్యులు ఎం. ప్రభాకరరావు, స్పెషలిస్టు డాక్టర్లు పూజిత, నజీర్, ఎ. సంతోష్‌కుమార్ హాజరయ్యారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, కోట, సంతపేట గ్రామాలకు చెందిన 385 మంది ఓపీ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వారికి వైద్యులు వివిధ రకాల వ్యాధి నిర్ధార పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వీరిలో 156 మంది ప్రజలు స్పెషలిస్టు వైద్యులను సంప్రదించడం విశేషం. వ్యాధిని బట్టి 12 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. ఇదే శిబిరంలో ప్రత్యేక కౌంటర్‌లో బి. ప్రతాప్‌కుమార్ 110 మందికి కంటి సంబంధిత పరీక్షల్ని నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీకి పేర్లను నమోదు చేసుకున్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార వంటకాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, గ్రామ పెద్దలు బసెల కృష్ణమూర్తి, చాతరాజుపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్. రజని, సీహెచ్‌వో ఎస్. పున్నారావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● జయ జయహే మహిషాసురమర్దిని.. రమ్య కపర్దిని శైల సుతే !



గౌరీదేవిగా కోటప్పకొండలోని భువనేశ్వరి అమ్మవారు



కౌమారి అలంకరణలో రొంపిచర్ల శ్రీ వాసవీ అమ్మవారు



సాతులూరు విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా..



నరసరావుపేటలో కౌమారి అలంకరణలో శ్రీవాసవీ మాత



నరసరావుపేటలో కౌమారి అలంకరణలో శ్రీచౌడేశ్వరి



నూజెండ్ల రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో అన్నపూర్ణాదేవిగా..

శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా క్లస్టర్ పరిధిలోని పలు ఆలయాల్లో రెండో రోజు అమ్మవారు పలు రూపాల్లో దర్శనమిచ్చారు. భువనేశ్వరిగా, గాయత్రి మాతగా, కౌమారదేవిగా, బాలాత్రిపుర సుందరీ దేవిగా, అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

– నరసరావుపేట రూరల్/ వినుకొండ(నూజెండ్ల)/ రొంపిచర్ల/నాదెండ్ల/శావల్యాపురం/నరసరావుపేట ఈస్ట్

కాల్వలో ఈతకు దిగి యువకుడి గల్లంతు



ప్రవీణ్ (ఫైల్)

ఈపూరు:మండలంలోని ఊడిజర్ల గ్రామ సమీపంలో గల నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువలో ఈతకు దిగి యువకుడు సోమవారం సాయంత్రం గల్లంతయ్యాడు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం సర్వాయిపాలెం గ్రామానికి చెందిన అంద్రా ప్రవీణ్ (23), అతని తమ్ముడు ప్రశాంత్ గుంటూరులో ఎస్ఐ జాబ్ కోసం పరీక్షలకు హాజరై ఊడిజర్లలోని బంధువుల వద్దకు వచ్చారు. వరుసకు పెదనాన్న అయిన అక్కదాసరి అచ్చయ్య, మరికొందరుతో కలసి గ్రామానికి ఆనుకొని ఉన్న కాలువ నీటిలో ఈతకు వెళ్లారు. అచ్చయ్య ఈత కొడుతుండగా ప్రవీణ్, ప్రశాంత్, అచ్చయ్య తమ్ముడు రవి వారి పిల్లలు ఒడ్డును ఉన్న మెట్ల పైన కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో ప్రవీణ్ ఈత కొట్టేందుకు కాలువ నీటిలో దిగాడు. నీటి ఉధృతి అంతగా లేనప్పటికీ ఈత రాక ప్రవీణ్ మునిగిపోయాడు. ఒడ్డున ఉన్నవారు కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లో ఉన్న యువకులు కాలువలో దిగి గాలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ కాలువ వద్దకు వచ్చి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి ప్రవీణ్ బంధువుల్ని అడిగి తెలుసుకున్నారు.

ఐసీఐసీఐ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం



వ్యాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌కు వ్యాన్ అందజేసిన ఐసీఐసీఐ ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రశంసించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యాన్‌ను జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐసీఐసీఐ ఫౌండేషన్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా బ్లడ్ సెంటర్‌కు వ్యాన్‌ను అందజేశారన్నారు. చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరాల్లో సేకరించే రక్త సంచులను వ్యాన్ ద్వారా రవాణా చేసే అవకాశం లభిస్తుందని, దీని ద్వారా జిల్లాలో రక్తం కొరత తీరబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, వైస్ చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి మురళీకృష్ణ, బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ మురళీధర్, ఐసీఐసీఐ ఫౌండేషన్ ఇన్‌చార్జి రాకేష్, కో–ఆర్డినేటర్ హర్షవర్ధన్, ఏపీ ఫౌండేషన్ ఇన్‌చార్జి శిరీష, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పేద మహిళల సొంతింటి కల సాకారం

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి:పేద మహిళల సొంతింటి కల నెరవేరాలనేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. బొల్లాపల్లిలో సోమవారం 100మందికి ఆయన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఇళ్ల పట్టాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 31 లక్షల మంది నిరు పేదలకు ఇళ్ల స్థలాల్ని అందజేసి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షలకు పైగా నిర్మించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాటుపడుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, జెడ్పీటీసీ సభ్యురాలు బీమ్లీబాయి, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గోవిందునాయక్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, పార్టీ మండల కన్వీనర్ ఎం.రాజయ్య, అవినాష్‌రెడ్డి, భట్టునాయక్, బి.శ్రీనునాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా నూతన పాలనకు ఒరవడి



చక్రాయపాలెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



బసికాపురంలో సచివాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

బొల్లాపల్లి:సచివాలయ వ్యవస్థ ద్వారా నూతన పాలనకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని చక్రాయపాలెం తండాలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఆయన సోమవారం ప్రారంభించారు. గజమాలతో నాయకులు, తండావాసులు వారికి ఘనస్వాగతం పలికారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించి రోగులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ రూ.40లక్షలతో సచివాలయాన్ని పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి, పేద ప్రజలకు అతి చేరువలో ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, జెడ్పీటీసీ సభ్యుడు బీమ్లీబాయి కృష్ణానాయక్, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గోవిందునాయక్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, పార్టీ మండల కన్వీనర్ ఎం.రాజయ్య, అవినాష్‌రెడ్డి, భట్టునాయక్, బి.శ్రీనునాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎన్. దుర్గేశ్వరరావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు,పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ పథకాలు: గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని బసికాపురంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలనను సీఎం జగన్ తీసుకువచ్చారని తెలిపారు.

గత నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.5.76కోట్లను గ్రామంలోని లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమచేసినట్లు తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. 274మందికి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లైటింగ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, పీఆర్ డీఈ హరనాథ్, గ్రామ సర్పంచ్ వంపుగుడి రాజేష్, మాజీ సర్పంచ్ వంపుగుడి జాన్, గ్రామ పెద్దలు జంగా లోకయ్య, వనజా లూథర్‌బాబు, అన్నలదాసు సుందరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గంగా సోమయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు దోచుకుంటే...జగనన్న పంచి పెట్టారు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి



అలవాలలో స్థానికులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: రాష్ట్రంలో ప్రభుత్వ సంపదను పేదలకు అందకుండా చంద్రబాబునాయుడు, అతని పార్టీ నాయకులు దోచుకుంటే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పంచి పెట్టారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అలవాలలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని రెండు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుమారు రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామానికి గత నాలుగేళ్లలో సంక్షేమం పథకాలు, అభివృద్ధి పనుల ద్వారా రూ.14.25కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూశామని, నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి లక్ష, రెండు, మూడు లక్షల రూపాయలు బ్యాంకు ఖాతాల్లో వేయడం చూశారా ? అని ప్రశ్నించారు. పేదల గుండె చప్పుడు సీఎం జగన్‌గా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వివిధ పథకాల ద్వారా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారన్నారు. ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రికి మీ ఆశీర్వాదంలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి ఏ మేరకు జరిగిందో వివరించారు. ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధి పత్రాల్ని అందజేశారు. సమస్యల్ని తెలుసుకుంటూ వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కిశోర్, ఏఎంసీ చైర్మన్ బత్తుల రామకృష్ణ, చపారపు గోపాలరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ పోటీల విజేతలు వీరే...

27న బహుమతి ప్రదానం

చిలకలూరిపేట: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు తియ్యగూర కోటిరెడ్డి స్మారకార్థం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీల్ని ఆదివారం నిర్వహించారు. విజేతల వివరాల్ని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాపు వెంకటరావు, ఆలా వేమనరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు కోటిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ నెల 27న బహుమతులు అందజేస్తామని ఆయన తెలియజేశారు.

వక్తృత్వ పోటీల విజేతలు

ప్రథమ బహుమతి: షావుకారు లిఖిత (మంగళగిరి), ద్వితీయ బహుమతి పానుగోతు రూప్లానాయక్(తాడికొండ), తృతీయ బహుమతి ఎస్‌కే రోషన్‌జమీర్ (గుంటూరు); ప్రత్యేక బహుమతులు: ఆర్ శ్రావణి (చిలకలూరిపేట), చందాన రమ (జిల్లెళ్లమూడి)

వ్యాస రచన పోటీలు

ప్రథమ బహుమతి: బొక్కా సత్యవాణి(జిల్లెళ్లమూడి), ద్వితీయ బహుమతి షేక్ షాహీనా వజీర్ (చిలకలూరిపేట), తృతీయ బహుమతి డి. వెంకటయ్య (చీరాల), ప్రత్యేక బహుమతులు: దావులూరి త్రిపురసుందరి (మంగళగిరి), కుంచాల నాగ ప్రవల్లిక(చిలకలూరిపేట)

క్విజ్ పోటీలు

ప్రథమ బహుమతి : శ్రీరోహిణీ కళాశాల జట్టు(చిలకలూరిపేట), ద్వితీయ బహుమతి హిందూ కళాశాల (గుంటూరు), తృతీయ బహుమతి విజ్ఞాన్ డిగ్రీ కళాశాల (గుంటూరు), ప్రత్యేక బహుమతులు: మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల, (జిల్లెళ్లమూడి), డీఆర్ఎన్ ఎస్‌సీవీఎస్ కళాశాల(చిలకలూరిపేట)

